

# మీరే ఆలోచించండి!

— కవిదిండి జయ

ఆరయ్యింది.

మోహన్ సోఫాలో జారగిలబడి 'అబ్బ... ఎంత నీరసంగా, చిరాగ్గావుంది.' అనుకున్నాడు. తల దిమ్ముగా వుంది. టీ తాగాలనిపించింది. సుజాత యింకా ఆఫీసునించి రాలేదు. లేచి వెళ్లి 'టీ' పెట్టుకునే ఓపిక, యింట్రస్టులేవు. సోఫాలో అలా వెనక్కి తల వాల్చి 'ఛీ ఏం జీవితం? ఆనందం, తృప్తి, మానసిక శాంతి లేనేలేవు.' అనుకున్నాడు. మూడు సంవత్సరాల నించి, నానా చావులు చచ్చి ప్రమోషన్ కోసం టెస్టులు వ్రాస్తే, చచ్చిచెడి పదిరోజుల క్రితమే ప్రమోషనొచ్చింది. జీతం పెరి గింది. కాని ఆనందం, తృప్తి, మానసిక శాంతి? ఏవీ? యివి మాత్రం తన జీవితంలోకి రాలేదు. అతనికి సుజాత మీద చిరాకు వేసింది. సుజాత వుద్యోగం మీద అంతకన్నా అసహ్యమనిపించింది.

ఆరున్నరయ్యింది.

రవి, పద్మ వస్తూనే—"మమ్మీ యింకారాలేదా?" అని మోహన్ని ఎంక్వయిరీ చేసి నిరాశపడ్డారు.

"పద్మా... కాస్త టీ పెట్టమ్మా తలనొప్పిగావుంది" అన్నాడు మోహన్.

"నాకివ్వాళ మధ్యాహ్నం నుంచీ చచ్చేటంత ఆకలిగావుంది. పప్పా ఈజీయేగా కాస్త అది కూడా వండేసేయి" అన్నాడు రవి తండ్రి పక్కనే కూర్చుంటూ.

"బావుంది. నేనసలే టైర్డ్‌గా వున్నాను. అదీ కాక మధ్యాహ్నం స్పోర్ట్సు పీరియడ్‌లో స్కిప్పింగ్ చేసినప్పుడు కాలు బెణికింది. నిల్చో లేకుండా వున్నాను" అంటూ వెళ్లి విసుగ్గా మంచంమీద పడుకుంది పద్మ.

రవి చిరాగ్గా-"యింకా మమ్మీ ఎందుకు రాలేదు ఎప్పుడూ యింతే. వెధవ ఆఫీసు. వెధవ వుద్యోగం. అందరిళ్లల్లో యింటికి రాగానే రిఫ్రెష్‌మెంట్సువుంటాయి. మనింట్లోనే ఈ చావు." అంటూ తండ్రి కేసి తిరిగి—"మీరెందుకు మమ్మీ చేత వుద్యోగం మానిపించరు. ప్రాక్టికల్‌గా, మమ్ వుద్యోగం చేయడం అనవసరం. దానివల్ల మనందరం సుఖపడటం కన్నా ఎక్కువ సఫర్ అవుతున్నాం" అన్నాడు.

మోహన్ ఈ మాటలు కొడుకు నుంచి, కూతురు నుంచి చాలాసార్లు విన్నాడు. కాని అప్పట్లో ఆ మాటల్ని అంతగా పట్టించుకోలేదు. కారణం ఆర్థిక యిబ్బందులు. సుజాత ఒక పెద్ద ఎడ్వర్టయిజ్‌మెంటు కంపెనీలో పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరుగా పదమూడొందలు సంపాదిస్తోంది. తనకి యిదివరకు పదకొండు వందలే-యిప్పుడు ప్రమోషనొచ్చి సూపర్ వైజర్ అయ్యాక పధ్నాలుగు వందలు అయ్యింది. ప్రస్తుతం వుంటున్న హౌసింగ్ బోర్డు ఫ్లాటుకి కట్టాల్సిన యిన్‌స్టాల్‌మెంట్సు కట్టడం పూర్తయ్యింది. కనుక గతంలో వున్నంత ఆర్థిక యిబ్బందులు ప్రస్తుతం వుండవు.

సుజాత చేత వుద్యోగం మానిపిస్తే చక్కగా మార్నింగ్ టిఫిన్ దగ్గర్నించి, ఈవెనింగ్ మీల్స్ వరకు రిలాక్స్‌డ్‌గా వుండొచ్చు. ప్రస్తుతం తను కూరగాయలకి, కరెంటుకి, గ్యాసుకి, పాలకి, రేషన్‌కి, కిరాణాకి, తిరిగే తిరుగుళ్లు... వాటర్ సప్లై లేకపోతే పక్కింటి బావిలోంచి నీళ్లు తేవడం—అబ్బ యివ్వన్నీ తప్పుతాయి. సుజాత యింట్లోనే వుంటుంది కాబట్టి, తనే యివ్వన్నీ చూసుకుంటుంది. తను ఆదరాబాదరాగా పరుగులెత్తుతూ అన్నిటికీ తిరగడం వంటివిమాని-విశ్రాంతిగా, మనశ్శాంతిగా వుండొచ్చు. తన పధ్నాలుగు వందలతో యిల్లుని బ్రహ్మాండంగా నడపొచ్చు. యింటి అద్దె ఎలాగూ లేదు కాబట్టి... సుజాత

రాగానే. గట్టిగా ఈ విషయం మాట్లాడాలి' అనుకున్నాడు మోహన్ రిలీఫ్‌గా.

ఏడున్నరయ్యింది.

సుజాత రాగానే, చేతిలో వున్న బ్యాగ్, ఫైల్సు టేబిల్ మీద పెడుతూ—కళ్ళు మూసుకుని, కదులూ-మెదులూ లేకుండా సోఫాలో పడుకున్న మోహన్‌ని చూసి- "ఎంత సేపయింది వచ్చి" అని పలకరించింది.

మోహన్ మౌనంగా వుండిపోయాడు. "తలనొప్పా ఏమిటి? అలా వున్నారు?" అంది మళ్లీ. మోహన్ భారంగా "వూ" అన్నాడు.

పక్కగదిలో వున్న రవి తల్లి గొంతు విని—"మమ్ వచ్చావా? ఆకలితో ఛస్తున్నా. టిఫిన్ ఏదన్నావండు" అనరిచాడు.

"ఏడున్నరయ్యింది. టిఫిన్ ఏవిటి? అన్నం వండేస్తా. పెంద రాళేతిందువుగాని" అంది సుజాత వంటింట్లోకి వెళ్తూ.

"నాన్సెన్స్. అన్నం కాదు. ముందు వుప్మా వండు. తొందరగా అయిపోతుంది. అన్నం ఆలస్యంగా తింటాలే" అన్నాడు రవి కోపంగా.

మంచం మీద పడుకున్న పద్మ లేస్తూ—"అవును మమ్మీ వుప్మా వండు" అంది.

సుజాత మారు మాట్లాడకుండా గ్యాస్ స్టౌ వెలిగించి టీ నీళ్లు పెట్టి, వుప్మాకి వుల్లిపాయలు తరగడం మొదలెట్టింది.

• •

రవి వుప్మా తింటూ "మా మమ్మీ మంచిది" అన్నాడు.

"వుప్మాలాంటి సాదా టిఫిన్ ని కూడా ఏదో అద్భుతం కలిపి చేస్తావేయ్. యు ఆర్ ఏన్ ఎక్సలెంట్ కుక్" అన్నాడు మోహన్.

"అబ్బ! మమ్ యింట్లో వుంటే ఎంత హాయిగా వుంది" అంది పద్మ.

సుజాతకి ఆనందం వేసింది. వీళ్లకి ఎంత ప్రేమ, అప్యాయత తనంటే. తమ మధ్య తల్లీపిల్లల-భార్యా భర్తల సంబంధం కన్నా మరేదో డీప్ అటాచ్‌మెంటు, దగ్గరతనం వున్నాయి. అందుకే వాళ్లలా ఆనందపడినప్పుడు తనకు 'యిదీ' అని నిర్వచించలేని అనుభూతి మనసులో కలుగు తోంది-అనుకుంది.

మోహన్ వుప్మా ప్లేటు కింద పెట్టి, ఫ్లాస్కులోని "టీ" కప్పులోకి వంపుకుంటూ "నేనొకటి చెప్తా. నువ్వొప్పుకోవాలి" అన్నాడు.

సుజాత నవ్వింది.

ఆ నవ్వు చూశాక వెంటనే మోహన్‌కి తను అడగదల్చుకు న్నది అడగాలన్పించలేదు. మనసు మూలల్లో గిల్టీగా అని పించింది.

మోహన్ మాట్లాడకపోవటం చూసి—"చెప్పండి. ఏవిటి?" అంది.

"నాకు ప్రమోషన్ వచ్చింది కదా!"

"అవును. అయితే?!"

"ప్రస్తుతం పద్నాలుగు వస్తోంది. ఈ ఫ్లాట్‌కి కూడా మనం డబ్బు కట్టడం పూర్తయ్యింది.

"వూ..."

"యిక నుంచీ మనకి ఆర్థిక యిబ్బందులు అంతగా వుండవు"

"వూ... "

"నువ్వింకా వుద్యోగం చేయడం అవసరమా?"

సుజాత గుండు దెబ్బతిన్నట్టు వెర్రిగా చూసింది మోహన్ వైపు.

"ప్రతిరోజూ మాతోపాటు అన్నీ వండి, నువ్వు అదరాబాదరా గా ఆఫీసుకు పరుగులెత్తడం... ఎందుకంత శ్రమ అని"

"ఎస్ మమ్మీ. డాడీ చెప్పింది కరెక్టు. నీతోపాటు మాకు కూడా శ్రమగా వుంది" అంది పద్మ.

తల్లి మౌనం చూసి— "అందరిళ్లల్లో చూస్తుంటానా? వాళ్ల అమ్మలు స్కూలు బేగ్స్ అందిచ్చి, బూట్సు వేసి, మళ్లీ స్కూల్సు నించి యింటికి రాగానే బేగ్స్ అందిచ్చుకుని, బూట్సు విప్పి ఎంతో యిదిగా చూస్తారనుకున్నావు. మాకో... ఈసురోమని యింటికి వస్తే—యింట్లో చీకటిగా, ఎవరూ వుండరు. యింటికి రాగానే చాలా బరువుగా, ఏదో ఖాళీగా అనిపిస్తుంది" అన్నాడు రవి.

"........"

"మళ్లీ నువ్వేమో ప్రొద్దుటే టిఫిన్, అన్నం ఒకేసారి తొమ్మిది లోగా చెయ్యలేనని టిఫిన్ చెయ్యవు. పెరుగన్నం తినేసి, మళ్లీ మధ్యాహ్నం అన్నం బాక్సులో పెట్టుకెళ్లమంటావు. అందరిళ్లల్లో అలాకాదు. చక్కా మార్నింగ్ టిఫిన్ వుంటుంది" అంది పద్మ.

"........"

"పోనీ ఆదివారం ఏదన్నా స్పెషల్ వుంటుందా? అంటే—నువ్వేమో యిల్లంతా సర్దుకుని మధ్యాహ్నమంతా రెస్టు అంటూ పడుకుంటావు—"

"చూశావా సుజా ఎన్ని కంప్లెయింట్స్... యిన్నాళ్లూ, యివ్వన్నీ మనసులో కదులుతున్నా నీతో చెప్పలేక పోయాను" అన్నాడు మోహన్.

యివ్వన్నీ వినగానే, సుజాత మనసులో ఆలోచనలు మెది లాయి.

.... ఒక రకంగా చదువుకునే రోజుల్నించీ, జాబ్ చెయ్యాలనే ఆలోచన బలంగా తనలో వుండేది. 'పెళ్లికి ముందే తనకి వుద్యోగం వచ్చింది. మోహన్‌కి అప్పటికి వుద్యోగం లేదు. తను వుద్యోగం చేస్తే, అతనికేమీ అభ్యంతరం లేదని ఖచ్చితంగా తెలుసుకున్నాకనే తమ పెళ్లి జరిగింది. మోహన్‌కి తమ పెళ్లయిన రెండు సంవత్సరాల వరకు జాబ్ దొరకలేదు. తన జీతం మీదే యిల్లు గడిచేది. ఆ తర్వాత కూడా తన జీతం అంత చూసుకునే హౌసింగ్ బోర్డు ఫ్లాటుకి అప్లైచేసుకుని, యిన్‌స్టాల్‌మెంట్ల ప్రకారం డబ్బు కట్టారు... ఈ రోజు ఆ వుద్యోగం వదిలెయ్యాలా?!

... తనకీ కష్టంగానేవుంది. యింటి చాకిరీ అంతా చేసు కుంటూ ఆఫీసుకు పరిగెత్తడం... కాని అందులో ఏదో ఆత్మ సంతృప్తి దొరుకుతుంది. వాళ్లకి కష్టంగా వుంటుందని తనే యింట్లో పనంతా చేసుకుంటోంది తప్ప వాళ్లని ఆ బరువు పంచుకోమనలేదే? అయినా వాళ్ల స్వంత బరువు తను పంచుకో లేదని, వాళ్ల అసంతృప్తి కాని...

"సుజా దీన్ని పెద్దగా ఆలోచించకు. యిన్నాళ్లూ నువ్వూ చాలా కష్టపడ్డావు. యిక నుంచీ మిగతా ఆడవాళ్లల్లాగ హాయిగా రెస్టు తీసుకో. నువ్వు వుద్యోగం చేయడం నా క్కూడా ఎంత అసౌకర్యంగా వుందో తెలుసా?"

"........"

"నేనసలు పెళ్లికి ముందు ఎంత జల్సాగా, జాలీగా వుండే వాడినో తెలుసా? మా అమ్మ ఏ నాడూ కనీసం టీ పొట్లం నాచేత తెప్పించలేదు. మానాన్న బాంకుకి సైతం నన్ను పంపి ఎరగరు. మంచం మీద పడుకుంటే, అక్కడికే టిఫిన్ ప్లేటు వచ్చేది. యింట్లో అడుగు పెట్టీ పెట్టగానే, నా చేతికి 'టీ' కప్పు అందేది. ప్రతిరోజూ నాకిష్టమయ్యే కూరలే వంట. సాయంత్రా లు సర్దాగా స్నేహితులుతో బాతాఖానీలు, ప్రొద్దుటే ఎనిమిది వరకు సుఖనిద్ర, ఆదివారం వస్తే స్వర్గమే యిక... ఆ జీవితం... అబ్బ! అంత సుఖం, ఆనందం, మనశ్శాంతి, తృప్తి... జీవితంలో అంతకన్నా ఏం కావాలి? యింత సంపాదిస్తున్నాం యిద్దరం కలిసి... ఏం లాభం... చెత్త, చెత్తగా బ్రతుకుతున్నట్టు అనిపిస్తోంది... నేనీ మధ్య ఎంత డిప్రెషన్ అనుభవిస్తున్నానో తెలుసా? పెళ్లయ్యాకనే, యిటువంటి ఒత్తిడులు, యిబ్బందు లు మధ్య జీవితం కిక్కిరిసి పోయింది. అప్పటికీ యింతకాలం, నా వ్యక్తిత్వానికి వ్యతిరేకంగా ఎడ్జస్ట్ అయ్యాను-కాని యిక ముందు..."

...వీళ్లకి విశ్రాంతి, సుఖం కావాలి. అవి తను జాబ్ మానేస్తే వస్తాయి. కాని జాబ్ మానితే శారీరకంగా తను సుఖపడినా, మానసికంగా... తను ఆధారం, జీవితంలో స్పార్క్ కోల్పోతుంది. ముఖ్యంగా తనకీ పి.ఆర్.వో జాబ్ అంటే చాలా అభిమానం

"నువ్వింట్లో వుంటేనే బావుటుంది మమ్మీ" ఫైనల్‌గా తేల్చే సినట్టు చెప్పాడు రవి.

సుజాత ఎటూ నిర్ణయించుకోలేకపోతోంది. ఒక రకంగా తను వుద్యోగం మానడం తప్పని సరిగా కనిపిస్తోంది. అంతవరకు విషయం పెరిగిపోయింది. వాళ్ల ఆనందానికి, సుఖానికి తను కేంద్రం. తనే వాటిని సప్లైచేసే పొజిషన్‌లో వుంది. ఒకవేళ తను వుద్యోగం కంటిన్యూ చేసినా, అది మూర్ఖత్వంలా వుంటుందేమో! పైగా వుద్యోగం యింకా చేస్తానంటే మోహన్, రవి, పద్మ తనని యిదివరకులా ప్రేమించగలరా? మోహన్‌లా తను కూడా పెళ్లికి ముందు ఎంత సుఖంగా, ఫ్రీగా వుండేది. అయినా తను అలా కంప్లయింటింగ్‌గా మాట్లాడలేదు. అసలు అలా భావించడమే తన పద్ధతికి వ్యతిరేకం. ఆమెకి ఈ ఆలోచనలన్నిటి వలన మనసు చేదుచేదుగా అయినట్ల న్పించింది. ఎందుకీ అనవసర ఆలోచన. తనకి వాళ్ల ప్రేమ కావాలి. తను వుద్యోగానికి రాజీనామా చేస్తే వాళ్లు తనని ప్రేమిస్తారు. అందుకే వుద్యోగానికి రాజీనామా చేస్తే విషయం తేలికవుతుంది అనిపించింది. కాని మళ్లీ జాబ్‌ని వదులుకో వడం అంత తేలికయిన విషయం, తేలిపైన పనిలా కనిపించ లేదు.

• • •

మోహన్ వచ్చీ రావటంతోనే—"హూష్...హబ్బ... చచ్చాన్రా నాయనా" అని ఆపసోపాలు పడుతూ, సోఫాలో కూలబడ్డాడు.

సుజాత 'టీ' అందిస్తూ- "ఏవిటి? ఏమయ్యింది?" అంది కొద్దిగా కంగారుగా, ఆశ్చర్యంగా

"నడుం నొప్పి సుజా"

"యిప్పట్నించీ నడుంనొప్పి ఏవిటండీ! ముప్పై ఐదేళ్లకే నడుం నొప్పి అంటున్నారు. యింక ముందు ముందు..."

"అంతేమరి. మానవమాత్రులు చెయ్యలేని గాడిద చాకిరి ఆఫీసులో చేసి, చచ్చి బస్టాపులో నిల్చుంటే—యిక సిటీబస్సు లు పెట్టే యిబ్బందులు నీకు తెలీనివికావుగా అసలు నిన్ను చూస్తుంటే భలే ఈర్ష్యగా వుందోయ్ హాయిగా యింట్లో కూర్చుని జీవితాన్ని ఎన్‌జాయ్ చేస్తున్నావు."

